పెన్ పవర్

10 YEAR ANNIVERSARY 2014 - 2024

తెలంగాణ రౌండప్

శనివారం 12 అక్టోబర్ 2024 పేజీలు 8


# జిల్లా ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు..

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, గౌతమ్..



గౌతమ్ పోట్రు.. మేడ్చల్ జిల్లా కలెక్టర్..


**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 11:** దసరా (విజయ దశమి) పండగ విజయానికి ప్రతీకగా నిలుస్తుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు అన్నారు.. దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకొని తొమ్మిది రోజుల పాటు దుర్గామాతను వివిధ రూపాలలో అలంకరించి , అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారని, అనంతరం విజయదశమి (దసరా) పండగను జరుపుకోవడం ఎంతో శుభపరిణామమని అన్నారు.. ఈ దసరా పండగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ కలెక్టర్ గౌతమ్ జిల్లా ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# దసరా అలయ్ బలయ్...

# మన తెలంగాణ స్పెషల్..!








**హైదరాబాద్ పెన్ పవర్:** ఎప్పుడూ బిజీగా కళకళలాడిన హైదరాబాద్ లాంటి నగరం, పండుగరోజు మాత్రం ఖాళీ రోడ్లతోనే కనిపిస్తుంది. సాధారణంగా దసరా రోజున దుర్గ అమ్మవారికి, శ్రీరాముడికి, ఆంజనేయస్వామికి పూజలు చేస్తారు. కొన్నిచోట్ల ఉదయం, సాయంత్రం పూజలు చేస్తారు.అలయ్ బలయ్ చెప్పకుంటూ.. ఎంతో సంతోషంగా దసరా పండుగను జరుపుకుంటారు. ఎక్కువ ఊళ్లలో మాత్రం దసరా పండుగంటే సాయంత్రం జరిగే పూజలే. పొద్దున ఇష్టమైన వంటలన్నీ చేసుకొని తిని, సాయంత్రానికి చక్కగా తయారై గుళ్లకు వెళ్తుంటారు. పెద్దలు, పిల్లలు. మధ్యాహ్నం ఇంట్లో చికెన్, మటన్.. లాంటి నాన్ వెజ్ వంటలే వండుకున్నా కూడా. సాయంత్రానికి గుడికి వెళ్తుంటారు చాలా ఊళ్లలో ఈ ఒక్క రోజు మాత్రం ఇలాంటి వాటిల్లో దేవుడు 'మాఫీ' చేస్తాడనే మాట చాలామంది చెప్తారు. సాయంత్రానికి గుడికెళ్లే అలవాటున్న ఇళ్లలో పిల్లలు పొద్దున్నుంచే కొత్త బట్టలు వేసుకోవాలని చేసే అల్లరి. మామూలుగా ఉండదు. సిటీలు, పట్టణాల్లో అయితే దగ్గర్లోని గుళ్లకే వెళ్తుంటారు. పల్లెలో మాత్రం దసరా రోజు అందరూ ఊరవతల ఉన్నట్టుండే ఆంజనేయస్వామి గుడికో, రాముడి గుడికో వె ళ్తుంటారు. జమ్మి చెట్టుకి మొక్కడం సంప్రదాయంగా వస్తుంది.

-మిగతా 2లో

## నిర్మానుష్యంగా మారిన హైదరాబాద్

- దసరా వరుస సెలవులతో ఊళ్లకు వెళ్తున్న ప్రజలు
- బోసిపోతున్న నగర రహదారులు
- ఖాళీగా తిరుగుతున్న సిటీ బస్సులు



అనధికారికంగా దాదాపు కోటిన్నర జనాభా కలిగిన హైదరాబాద్ మహానగరం నిర్మానుష్యంగా మారిపోయింది. దసరా పండుగకు గాను ప్రజలు వారి స్వస్థలాలకు వెళ్లడంతో నగరంలోని రహదారులు బోసిపోతున్నాయి. పండుగ నేపథ్యంలో వరుస సెలవులు రావడంతో ప్రజలు సొంతూళ్లకు వెళ్తు న్నారు. హైదరాబాద్ లోని సిటీ బస్సులు సైతం తక్కువ ఆక్యుపెన్సీతో తిరుగుతున్నాయి. గత బుధవారం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు నగరాన్ని వీడారు. హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులు, రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసి పోయాయి. రెండు రాష్ట్రాల ఆర్టీసీలు ప్రత్యేక బస్సులను నడుపుతున్నాయి. ప్రైవేట్ బస్సులు డబుల్ ఛార్జీలు వసూలు చేస్తూ ప్రయాణికులను దోచుకుంటున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో పాఠశాలల సెలవులు ఈ నెల 14తో ముగియనున్నాయి. దీంతో, ఊళ్లకు వెళ్లిన వారంతా రాబోయే మంగళ, బుధవారాల్లో మళ్లీ హైదరాబాద్ కు చేరుకోనున్నారు.

## రేవంత్ రెడ్డి గారూ...

# ఆ డబ్బులకు నేనే ప్రత్యక్ష సాక్షిని..!



- పేదలు బర్రెలు, గొర్రెలు పెంచుకుంటూ బతకాలని కేసీఆర్ భావించారని సీఎం విమర్శలు
- సీఎం మాటలు విడ్డూరంగా ఉన్నాయని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కౌంటర్
- కేసీఆర్ టైంలో ప్రతిభావంతులైన బిడ్డలకు క్షణాల్లో లక్షలు పడేవని వెల్లడి

-2 లో

## సమగ్ర కులగణనపై తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు

- సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేయనున్నట్లు జీవోలో పేర్కొన్న ప్రభుత్వం
- సామాజిక, ఆర్థిక, విద్య అంశాలపై సర్వే
- సర్వే బాధ్యతను ప్రణాళిక శాఖకు అప్పగిస్తూ సీఎస్ ఉత్తర్వులు

**హైదరాబాద్ పెన్ పవర్:** సమగ్ర కులగణనపై తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేయనున్నట్లు జీవోలో పేర్కొంది. సామాజిక, ఆర్థిక, విద్య అంశాలపై సర్వే చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వెల్లడించారు. ఈ సర్వే బాధ్యతను ప్రణాళిక శాఖకు అప్పగిస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగ, రాజకీయ, కుల అంశాలపై సర్వే చేయనున్నట్లు సీఎస్ వెల్లడించారు. 60 రోజుల్లో సర్వే పూర్తి చేయాలని జీవోలో పేర్కొన్నారు.



# దసరా అలయ్ బలయ్.. మన తెలంగాణ స్పెషల్..!

**ఎన్నెన్నో పురాణ కథలు**

ఏ యుగంలోనైనా చెడుకి, మంచికి ఎప్పుడూ పోరాటం జరుగుతూనే ఉంటుంది. అందులో చెడుపై మంచి గెలుస్తూనే ఉంటుంది. ఆ గెలుపును ఒక వేడుకలా జరుపుకోవడమనే ఫిలాసఫీ దసరా పండుగలో ఉంది. దసరా పండుగ వెనుక ఎన్నో పురాణ కథలు ఉన్నాయి. మహిషాసురుడనే రాక్షసుడ్ని దుర్గాదేవి చంపిన ఆనందంలో దసరా పండుగ చేసుకుంటారన్నది మనకు ప్రధానంగా వినిపించే కథ ఇది కాకుండా రామాయణ,మహాభారతాల్లోనూ దసరా పండుగ ఎందుకు చేసుకుంటామనే దానికి కథలున్నాయి. ఈ అన్ని కథల్లోనూ... చెడుపై విజయమే ప్రధానమైన అంశం. అన్ని కథల్లోనూ చెడుపై మంచికి విజయం 'దశమి' రోజునే దక్కింది. అందుకే 'విజయ దశమి' అయ్యింది ఈ రోజు. వీటిల్లో ఏ కథను లెక్కలోకి తీసుకున్నా, అది విజయదశమే. మనందరం వైభవంగా చేసుకుంటున్న పెద్ద పండుగే.

**భక్తి ఒక్కటే కాదు.**

చెడుపై మంచి సాధించే విజయమే ఈ పండుగని చెప్పుకున్నాం కదా! ఇది మానవుడికి మరింకెన్నో రూపాల్లో కూడా గొప్ప పండుగ ఎందుకంటే చీకటి నుంచి వెలుగు వైపునకు చేసే ప్రయాణం ఈ పండుగ. అలాగే అజ్ఞానం నుంచి జ్ఞానం వైపుకు అడుగులు వేయడం కూడా ఈ పండుగలో ఉన్న ఫిలాసఫీనే. అందుకే ఈ పండుగలో దేవుడిని పూజించడం అన్న ఆలోచన, భక్తి ఒక్కటే ఉండదు. బంధువులు, స్నేహితులను కలుసుకొని 'అలయ్ బలయ్ ఇచ్చుకోవడం, అందరూ బాగుండాలని

కోరుకోవడం, అందరితో కలిసి రావణదహనంలో పాల్గొనడం దసరా రోజు కనిపిస్తుంది. ఇది చెడుపై పోరాటానికి అందరూ ఏకం కావాలన్న ఆలోచనను గుర్తు చేస్తుంది. ఏ పండుగ అయినా ఎక్కడెక్కడో వాళ్ల వాళ్ల ఉద్యోగాల కోసం వెళ్లిపోయిన మనుషులందరినీ ఒక్కటి చేస్తుంది. బస్ టికెట్ రేట్లు పెరిగినా. రైళ్లలో నిలబడటానికి చోటు కూడా లేకున్నా సొంత ఊళ్లకు అందరూ పండుగ వస్తున్నదంటే 'క్యూ'కడుతున్నారంటే, ఆ పండుగ చిన్న పండుగ కాదు.ఈ దసరా అందరికీ విజయాన్ని చేకూరుస్తుందనికోరుకుందాం.

## రేవంత్ రెడ్డి గారూ...

# ఆ డబ్బులకు నేనే ప్రత్యక్ష సాక్షిని..!

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పేదలు, ఎస్సీ, ఎస్టీలు గొర్రెలు, బర్రెలు, చేపలు పెంచుకుంటూ బతకాలని కేసీఆర్ భావించారని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కొందుర్గులో నిర్వహించిన సభలో సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఈ వ్యాఖ్యలపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఎక్స్ వేదికగా స్పందించారు."రేవంత్ రెడ్డి గారు, మీరు ఈ రోజు కొందుర్గులో మాట్లాడిన మాటలు చాలా విడ్డూరంగా ఉన్నాయి. కేసీఆర్ గారు ఎస్సీ, ఎస్టీలను గొర్రెలకు బర్రెలకు పరిమితం చేశారని మీరు నింద వేయడం గురించి రేపు అన్ని వివరాలతో మీడియాతో మాట్లాడుతాను కాని, ముందు మీ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల నుండి ముగ్గురు సాఫ్ట్ బాల్ క్రీడాకారులు తైవాన్ ఇంటర్నేషనల్ టోర్నీకి సెలక్ట్ అయ్యారు. వాళ్ల చార్జీలకు ఐదు లక్షల రూపాయలు కూడా మీ అధికారులు ఇవ్వడం లేదంట! ఆ పిల్లలు ఇక గొర్రెలు బర్రెలు కాయకపోతే ఏం చేస్తారు? కేసీఆర్ గారి టైంలో అయితే ఇలాంటి ప్రతిభావంతులైన బిడ్డలకు క్షణాల్లో లక్షల్లో డబ్బులు పడేవి. దానికి నేనే ప్రత్యక్ష సాక్షిని" అని ప్రవీణ్ కుమార్ రాసుకొచ్చారు.

# వీటితో బతుకమ్మ పాటను ఆపలేరు

### సీఎం రేవంత్ పై మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి విమర్శలు

### బతుకమ్మ పాట వింటేనే రేవంత్ కు వణుకు పుడుతుందని వ్యాఖ్య

### మహిళలకు రేవంత్ క్షమాపణ చెప్పాలని డిమాండ్



**హైదరాబాద్ పెన్ పవర్:**దాడులు, నిషేధాలు, కేసులతో బతుకమ్మ పాటను ఆపలేరని బీఆర్ఎస్ సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. బతుకమ్మ పాట వింటేనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వణుకు పుడుతుందని చెప్పారు. అట్లతద్దె సంస్కృతి ఉన్నవారితో అంటకాగిన రేవంత్... బతుకమ్మకు ప్రాధాన్యతను ఇవ్వడం లేదని విమర్శించారు. బతుకమ్మ పండుగను ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని అన్నారు. బతుకమ్మ పండుగ కల తప్పిందని ప్రజలు అనడం రేవంత్ పాలనకు నిదర్శనమని చెప్పారు. పండుగ ఏర్పాట్లలో విఫలమైనందున... ఇప్పటికైనా రాష్ట్ర మహిళలకు రేవంత్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వం యూట్యూబ్ ఛానల్స్ ను, సోషల్ మీడియాను ఆపగలదేమో కానీ... ఉద్యమాలను ఆపలేదని జగదీశ్ రెడ్డి అన్నారు. ప్రజల మధ్యకు ఎప్పుడు రావాలో తమ అధినేత కేసీఆర్ కు తెలుసని చెప్పారు. సూర్యాపేటలోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో తన కుటుంబ సభ్యులతో కలిసి జగదీశ్ రెడ్డి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం శాలువా, పట్టువస్త్రాలతో సత్కరించారు. అమ్మవారి దర్శనానంతరం జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజలంతా పాడిపంటలతో, సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని కోరుకున్నానని తెలిపారు.

# చెన్నూరును రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా:

# ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి






**హైదరాబాద్ పెన్ పవర్:**మంచిర్యాల జిల్లా: చెన్నూరు నియోజకవర్గంలోని సోమన్ పల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ శంకుస్థాపన చేశారు. సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి కూడా ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్మికులతో పలు అంశాలపై మాట్లాడారు.

సింగరేణి కార్మికులు, సింగరేణి అధికారులు.. ఎమ్మెల్యే, ఎంపీని సన్మానించారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణ కార్మికులతో కలిసి భోజనాలు చేశారు. అనంతరం.. ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ.. గత పదేళ్లలో చెన్నూరు నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని, పదేళ్లుగా అభివృద్ధి కుంటుపడిందని చెప్పారు. రోడ్లు, డ్రైనేజీలను పట్టించుకోలేదని, తాను చెన్నూరులో మార్నింగ్ వాక్ చేస్తున్నప్పుడు రోడ్లు డ్రైనేజీలు బాలేవని ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చారని ఎమ్మెల్యే చెప్పారు.

చెన్నూర్ టౌన్, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. చెన్నూరులో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని, హైదరాబాద్, కరీంనగర్‌కు వెళ్లాల్సిన పని లేదని చెప్పారు. మంచి వైద్యం అందుబాటులో ఉంటుందని, డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశామని, క్యాన్సర్ పేషెంట్ల కష్టాలు తీర్చామని ఎమ్మెల్యే గుర్తుచేశారు. చెన్నూర్ నియోజకవర్గ ప్రజలు తనకు సహకరించాలని, రాష్ట్రంలోనే చెన్నూరు నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మాటిచ్చారు.

**ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఇంకా ఏమన్నారంటే..**


- మిషన్ భగీరథ ప్రాజెక్టులో అనేక అవకతవకలు జరిగాయి
- కాంగ్రెస్ ప్రజా పాలనలో ఎవ్వరూ నష్టపోకుండా చూస్తాం
- చెన్నూర్ ప్రాంతాన్ని అమృత్ స్కీం ద్వారా 30 కోట్లతో పనులు ప్రారంభించాం
- వంద కోట్లతో చెన్నూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి
- అన్ని గ్రామాల్లో మంచినీటికి కరువు ఉండేది.. సుమారు వంద బోర్ వేల్స్ వేసి నీటి ఎద్దడి లేకుండా చూశాం
- చెన్నూర్ ప్రాంతంలో ఫారెస్ట్ ప్రాంతం ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి
- 100 కోట్లతో జోడు వాగులు రోడ్డు పనులకు నిధులు మంజూరు చేశాం
- చెన్నూర్ టౌన్, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం
- 125 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ బిల్డింగ్ కి శంకుస్థాపన చేశాం
- చెన్నూర్ లో శాండ్ మాఫియా, పేకాట, అక్రమ దందాలు జరిగితే సహించేది లేదు
- ఇక్కడ పని చేయడానికి, ప్రజలకు సేవ చేయడానికి వచ్చాను. అభివృద్ధి చేస్తాను.
- ప్రజల అవసరాలను తీర్చి అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తాను
- అన్ని వర్గాల వారికి పనులు సక్రమంగా చేయడానికి ప్రణాళికలు రూపొందించాను

# సహారా ఎడారిలో నీరు..

**న్యూఢిల్లీ, అక్టోబరు 11, పెన్ పవర్:**సహారా ఎడారిలో నీటిమడుగులు ఏర్పడ్డాయి. ఆ ప్రాంతంలో ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాలలో సందడి చేస్తున్నాయి. సహారా ఎడారి మొరాకో దేశంలో విస్తరించి ఉంది. ప్రస్తుతం ఈ ఎడారిలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈత చెట్లు, నీటిమడుగుల మధ్య నీటిమడుగులు ఏర్పడ్డాయి. ఈ దృశ్యాలు సోషల్ మీడియా లో సందడి చేస్తున్నాయి. ఆగ్నేయ మొరాకో దేశంలో విస్తరించిన సహారా ఎడారిలో వర్షాలు కురుస్తాయి. అయితే గత సెప్టెంబర్ నెలలో ఈ ప్రాంతంలో కురవాల్సిన వర్షం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయింది. మొరాకో రాజధాని రబాత్ నగరానికి దక్షిణంగా 450 కిలోమీటర్ల దూరంలో ఉన్న టాగో నైట్ గ్రామంలో గత 24 గంటల వ్యవధిలో 100 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.వర్షాలు విస్తారంగా కురవడంతో సహారా ఎడారి ప్రాంతం సముద్రం లాగా కనిపిస్తోంది. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాలలో సందడి చేయడంతో పర్యాటకులు ఈ ప్రాంతానికి తరలివస్తున్నారు. ఈత చెట్లు, ఖర్జూర చెట్ల మధ్య ఏర్పడిన నీటి గుంతులను చూసి ఆశ్చర్యపోతున్నారు. " ఈ దృశ్యాలను మేము నమ్మలేకపోతున్నాం. సహారా ఎడారిలో ఈ స్థాయిలో వర్షాలకురుస్తున్నాయంటే ఆశ్చర్యంగా ఉంది. గత 50 సంవత్సరాలలో మొదటిసారిగా ఇక్కడ వర్షపాతం నమోదయింది. ఇది మాకు సంభ్రమాశ్చర్యానికి గురిచేస్తోందని" మొరాకో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మెటీరియాలజీ హుస్సేన్ పేర్కొన్నారు. గత ఆరు సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో దారుణమైన కరువు ఏర్పడింది. దీంతో రైతులు తమ పొలాలను మొత్తం బీడుగా ఉంచారు. అయితే ఇప్పుడు వర్షాలు కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ పొలాలను తిరిగి సాగు చేసుకుంటామని చెబుతున్నారు.. ఇక భారీ వర్షాలు కురవడం వల్ల అల్జీరియా ప్రాంతంలో 20 మందికి పైగా కన్నుమూశారు. వేలాది ఎకరాలలో ఖర్జూర తోటలు దెబ్బతిన్నాయి. దీంతో ప్రభుత్వం వరద సహాయక చర్యలను చేపట్టింది. జాగోర ? టాటా మధ్య 50 సంవత్సరాలుగా ఎండిపోయిన ఇరిగి అనే సరస్సు రెండుగా నీటితో కనిపిస్తోంది. నాసా విడుదల చేసిన ఉపగ్రహ చిత్రాలలో ఈ మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కొన్ని సంవత్సరాలుగా కరువు తాండవం చేయడంతో.. చాలామంది విదేశాలకు వలస వెళ్లిపోయారు. కొంతమంది రైతులు భూములను అడ్డగోలు ధరలకు అమ్ముకున్నారు. తీరా ఇన్ని సంవత్సరాల తర్వాత వర్షాలు కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన నీటి వనరులు జల కళ ను సంతరించుకున్నాయి. అయితే మరి కొద్ది రోజులపాటు ఈ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

# లయిక ఉత్తుత్తిదేనా? అంత హైప్ వచ్చినా తుస్సు మనిపించారుగా?

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, చంద్రబాబు సమావేశమై మూడు నెలలు దాటి పోతుంది. ఇప్పటి వరకూ దేనిపైనా పురోగతి లేదు. ఆర్భాటంగా నాడు జరిగిన సమావేశం నేటికీ ఎలాంటి ఫలితాలను ఇవ్వలేకపోయింది. సమస్యలు అలాగే పెండింగ్‌లో ఉన్నాయి. విభజన సమస్యలపై చర్చించడానికి అని ఈ ఏడాది జూన్ 6వ తేదీన ప్రజాభవన్ లో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం జరిగింది. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో అనేక సమస్యలు తీరతాయని అందరూ భావించారు. తర్వాత ముఖ్యమంత్రులు ఎవరూ మాట్లాడకపోయినా, మంత్రులు సమావేశం తర్వాత కార్యాచరణను వివరించారు.




**అనేక సమస్యలు...**

ప్రధానంగా కృష్ణా జలాల పంపిణీతో పాటు షెడ్యూల్ 9, 10లో ఉన్న సంస్థల విభజనపై చర్చించాలనుకున్నారు. రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో వారి మధ్య అనేక విషయాలు ప్రస్తావనకు వచ్చాయని అప్పట్లో వార్తలు వచ్చాయి. విద్యుత్తు బకాయిలు చర్చించారన్నారు. షెడ్యూల్ 9 లో ఉన్న 91 సంస్థల విభజనతో పాటు అప్పులు, నగదు నిల్వల పంపిణీపై సమస్య ఒక కొలిక్కి వస్తుందని భావించారు. 23 సంస్థల పంపిణీపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో వాటికి పరిష్కారం లభిస్తుందని ఆశించారు. తెలుగు అకాడమీ, తెలుగు యూనివర్సిటీ, అంబేద్కర్ యూనివర్సిటీ వంటి వివాదాలు కూడా దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్నాయి.

**జులై ఆరో తేదీన**

అయితే జులై ఆరో తేదీన జరిగిన సమావేశంలో మూడు స్థాయిల్లో సమస్యల పరిష్కరించాలని నిర్ణయించారు.ఒకటి తొలుత వెంటనే ఇరు రాష్ట్రాలకు చెందిన ఉన్నతాధికారులు సమావేశమై సమస్యలపై చర్చించాలనుకున్నారు. ఏపీ నుంచి ముగ్గురు, తెలంగాణ నుంచి ముగ్గురు అధికారులు ఉంటారని చెప్పారు. ఆ సమావేశంలో సమస్యలు పరిష్కారం కాకపోతే మంత్రుల కమిటీ సమస్యలపై చర్చిస్తుందన్నారు. ఇరు రాష్ట్రాలకు చెందిన మంత్రుల సమావేశంలో ఈ సమస్యలు కొలిక్కి రాకపోతే చివరకూ మూడవ దశలో ముఖ్యమంత్రుల సమావేశం జరుగుతుందని, అందులో ఈసారి ప్రధాన సమస్యలను పరిష్కరించుకుంటామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం వద్దకు వెళ్లకుండా తామే తమ రాష్ట్రాల సమస్యలను పరిష్కరించుకుంటామని చెప్పిన ఇరు రాష్ట్రాల నుంచి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇప్పటి వరకూ ఆ ఊసే లేదు. మరి మూడు నెలలు క్రితం జరిగిన సమావేశం ఉత్తుత్తికేనా అన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

## ఇరు వర్గాల ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** తోట్లవల్లూరు (మ) రొయ్యూరు ఇసుక క్వారీలో ఎడ్ల బండ్లకు చెందిన ఇరువు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఘటనలో నలుగురికి గాయాలు అయ్యాయి. వారిని ఆసుపత్రికి తరలించారు. ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు వసి కర్రలతో దాడులు చేసుకున్నాయిజ మోర్ల శివ సాయి, అతని బావమరిది పై జస్వంత్, ఈశ్వర్ లు దాడి చేసారు. శివ సాయికి తలపై తీవ్రగాయాలు అయ్యాయి. బాధిలులు పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసారు. తలకు తీవ్రగాయాలు కావడంతో శివసాయిని ఆస్పత్రికి పంపించారు. ఐలూరు, కళ్ళం వారి పాలెం, చాగంటిపాడు, భద్రిరాజుపాలెం రాత్రి సమయాల్లో వందలాది ఎడ్లబండ్లతో యదేచ్ఛగా ఇసుక తోలకాలు జరుగుతున్నాయి. ఎడ్ల బండ్లతో తోలి డంపు చేసి ట్రాక్టర్లకు ఎగుమతి చేస్తారు.

## దువ్వాడ శ్రీనివాస్, మాధురిలపై కేసు నమోదు

**హైదరాబాద్ పెన్ పవర్:**దివ్వెల మాధురి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పై పోలీసులకు టీటీడీ విజిలెన్స్ పిర్యాదు చేసింది. శ్రీవారి ఆలయ మాడవీధుల్లో, బ్రహ్మోత్సవాల సమయంలో వ్యక్తిగత విషయాలు మాట్లాడినట్లు విజిలెన్స్ పిర్యాదులు పేర్కొంది. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన, సెక్షన్ 299,300 క్రింద కేసు నమోదు చేసారు.

దర్యాప్తు చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని స్థానిక డిఎస్పి విజయ్ శేఖర్ అన్నారు.

## పెరుగుతున్న సైబర్ నేరాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో సైబర్ నేరాల సంఖ్యపెరిగిపోతోందని, వాటి నుండి రాష్ట్ర ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ అన్నారు. గురువారం వార్షిక తనిఖీలలో భాగంగా కృష్ణాజిల్లా నాగాయలంక పోలీస్ స్టేషన్ ని జిల్లా ఎస్పీ గంగాధరరావు తో కలిసి తనిఖీ చేశారు. ముందుగా నాగాయలంక పోలీసు సిబ్బంది నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు. మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు దాదాపు 6 గంటల పాటు నిర్వహించిన ఈ తనిఖీలో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నాగాయలంక స్టేషన్ పరిధిలో ఒక ఒక వృద్ధురాలి హత్య కేసు మాత్రమే పెండింగ్ లో ఉందని అన్నారు. మహిళలు, చిన్నారుల భద్రతకు పెద్దపీట వేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ డిఎస్పీ మురళీధర్, అవనిగడ్డ సిఐ యువకుమార్, చల్లపల్లి సిఐ ఈశ్వరరావు, నాగాయలంక ఎస్ ఐ రాజేష్ లు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లాలో నకిలీ బంగారం మోసం

**హైదరాబాద్ పెన్ పవర్:** తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, ఏ.రంగంపేటలో నకిలీ బంగారంతో ఘరానా మోసానికి పాల్పడ్డారు దుండగులు. తక్కువ ధరకే గోల్డ్ అమ్ముతామంటూ రూ.5 లక్షలు కాజేశారు. రమేష్ అనే వ్యక్తి నుంచి ఒక కేజీ నకిలీ బంగారాన్ని పూజారి సుబ్రమణ్యం కొనుగోలు చేశాడు. కొంత బంగారాన్ని అమ్మేందుకు ప్రయత్నించగా నకిలీ బంగారం అని తేలింది. మోసపోయిన బాధితుడు చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దుర్గగుడిలో వీఐపి సేవల్లో తరిస్తున్న అధికారులు.

హైదరాబాద్ పెన్ పవర్:అమ్మవారి దర్శనంలో సామాన్యులకు పెద్ద పీట అని సిఎం, మంత్రులు చెబుతున్నారు. మరోవైపు, విఐపీ సేవల్లో ఆలయ అధికారులు తరిస్తున్నారు. అమ్మవారి దర్శనం కి వచ్చే భక్తులకు కుంకుమ దూరం చేస్తున్నారు. కుటుంబ సభ్యులకు అంతరాలయం దర్శనలకు పరిమితం అవుతున్నారు. 5000 పెట్టీ టికెట్ కొన్న భక్తులకు అమ్మవారి అంతరాలయ దర్శనం దక్కడం లేదు. ఆలయ అధికారులు పై సామాన్య భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రద్దీ లేకపోయినా గంటలు గంటలు అమ్మ దర్శనం కోసం క్యూ లైన్ లో వేచి వుంటున్నామనంటున్నారు.

## హరీశ్‌రావుకు కోమటిరెడ్డి వార్నింగ్



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నేతలపై ఆయన మండిపడ్డారు. ప్రతి పనికీ అడ్డం తగులుతూ అభివృద్ధికి ఆటంకంగా మారారని అన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులపై తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. మూసీ నది నీటితో... మూసీ నది నీటితో కోటి మంది ఎఫెక్ట్ అవుతున్నారన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి మూసీని శుద్ధి చేస్తామంటే.. కేటీఆర్ అడ్డుపడుతున్నారని తెలిపారు. రుణమాఫీపై హరీష్‌రావు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని, బీఆర్ఎస్ హయాంలో లక్ష రూపాయల రుణమాఫీనే నాలుగు విడతలు చేశారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన రుణమాఫీ వడ్డీలకే సరిపోయిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## ఆ చిరుతపులిని చంపిందెవరు?



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఒక చిరుత పులి మరణించింది. ఎవరైనా దీనిని చంపారా? లేదా అనారోగ్యంతో మృతి చెందిందా? అన్న కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. నాగర్‌కర్నూలు జిల్లా నల్లమల అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. చిరుతపులి కళేబరాన్ని చూసిన స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అనారోగ్యంతోనేనా? అయితే చిరుతపులి అక్కడకు రావడంతో వేటగాళ్ల బారిన పడి చనిపోయిందా? అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతుందన్నాయి. అమరగిరి రహదారి పక్కన గుడి ప్రాంతంలో ఈ చిరుతపులి మరణించింది. అటవీ శాఖ అధికారులు చిరుత పులి మరణించడానికి కారణాలపై విచారణ ప్రారంభించారు. దీంతో పాటు అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు.

# ఎవరీ నోయల్ టాటా..? ఆయన ప్రస్థానం ఇలా..



హైదరాబాద్ పెన్ పవర్:ఇంటర్నెట్ డెస్క్: టాటా గ్రూప్‌నకు గుండెకాయలాంటి ట్రస్ట్‌లకు ఛైర్మన్‌గా నోయల్ టాటా ఎంపికయ్యారు. దీంతో సంస్థకు రతన్‌టాటా తర్వాత ఆయనే ఉత్తరాధికారి అయ్యారు. ఈ పరిణామంతో ఇంతకీ ఎవరీ నోయల్? కంపెనీలో ఆయన ఎలా ఎదిగారనే అంశాలు ఆసక్తికరంగా మారాయి. కంపెనీలో పెద్ద బాధ్యతలు నిర్వహిస్తున్నా ఈయన పేరు వార్తల్లో పెద్దగా కనిపించదు. ఆర్భాటాలకు దూరంగా తన పని తాను చేసుకొంటూ వెళతారనే పేరుంది.

**రతన్ టాటాకు వరుసకు సోదరుడు..**

నావల్ టాటాకు ఇద్దరు భార్యలు. తొలి భార్య సూని సంతానం రతన్, జిమ్మీ. 1940లో ఈ జంట విడిపోయింది. 1955లో సిమోనె అనే స్విస్ వ్యాపారవేత్తను నావల్ వివాహం చేసుకొన్నారు. వారి కుమారుడే నోయల్. టాటా గ్రూప్ రిటైల్ విభాగం విస్తరణకు సిమోనె చాలా శ్రమించారు. ఇటీవల తనకు కుమారుడు వరసయ్యే రతన్‌ను కడసారి చూసేందుకు ఆమె వచ్చారు కూడా. ఇక నోయల్ విద్యాభ్యాసం మొత్తం ప్రతిష్ఠాత్మక సంస్థల్లోనే జరిగింది. సస్సెక్స్ విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పట్టా అందుకొన్నారు. నుంచి ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌ను పూర్తి చేశారు.

**టాటాలో వ్యాపార ప్రస్థానం మొదలు..**

విదేశాల్లో వ్యాపారాలు చేసే టాటా ఇంటర్నేషనల్‌లో ఆయన కెరీర్‌ను ప్రారంభించారు. గ్రూప్ రిటైల్ విభాగమైన ట్రెంట్‌లో 1999లో బోర్డు సభ్యుడయ్యారు. ఈ సంస్థను ఆయన తల్లి సిమోనె స్థాపించారు. నోయల్ వచ్చాకే ఆ సంస్థ లిటిల్ ఉడ్స్‌ను కొనుగోలు చేసి.. దానిని వెస్ట్‌సైడ్‌గా మార్చింది. 2003లో టైటాన్ ఇండస్ట్రీస్ డైరెక్టర్‌గా కూడా ఆయనకు బాధ్యతలు అప్పగించారు. 2010నాటికి ఆయన టాటా ఇంటర్నేషనల్ ఎండీ స్థాయికి చేరుకొన్నారు. ఆయన హయాంలోనే కంపెనీ 500 మిలియన్ డాలర్ల వ్యాపారం నుంచి 3 బిలియన్ డాలర్లకు వృద్ధి చేసుకొంది. టాటా రిటైల్ వ్యాపారాలను చూస్తే ట్రెంట్ సంస్థకు 1998లో ఒక బ్రాంచ్ మాత్రమే ఉంది. కానీ, నోయల్ దీని బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి వేగంగా విస్తరిస్తూ వచ్చింది. ప్రస్తుతం దీనికి 700 శాఖలు ఉన్నాయి.

**కీలక బాధ్యతలు నోయల్ చేతిలోనే..**

ప్రస్తుతం ట్రెంట్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్‌కు ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. టాటా ఇంటర్నేషనల్‌కు ఎండీ ఆయనే. ఇక టైటాన్, టాటా స్టీల్‌కు వైస్ ఛైర్మన్‌గా బాధ్యతలూ చూస్తున్నారు. వోల్టాస్ బోర్డు సభ్యుడు కూడా. దాదాపు దశాబ్దం నుంచి ఆయన రతన్ వారసత్వం అందుకొంటారని బలంగా ప్రచారం జరుగుతోంది. మధ్యలో సైరస్ మిస్త్రీ ఎపిసోడ్ కారణంగా జాప్యం జరిగింది. ఇక 'శ్రీదోరబ్జీ టాటా' 'శ్రీరతన్ టాటా' ట్రస్టుల్లో ఆయన ట్రస్టీ. ఇవి నిర్వహించే సేవా కార్యక్రమాల పర్యవేక్షణ కూడా ఆయనే చూస్తుంటారు. వ్యాపారం, దాతృత్వంలో టాటా సంప్రదాయాన్ని ఆయన ముందుకు తీసుకెళుతున్నారు. 2024 నాటికి నోయల్ టాటా ఆస్తి విలువ సుమారు రూ.12,400 కోట్లు.

**కుటుంబం అండగా..**

నోయల్ భార్య ఆలూ పల్లోంజీ మిస్త్రీ కుమార్తె. టాటా గ్రూప్‌లో పెద్దమొత్తంలో ఆమె కుటుంబానికి వాటాలున్నాయి. ఈ దంపతులకు ముగ్గురు సంతానం కుమార్తెలు లేహ, మాయా, కుమారుడు నెవిల్లె ఉన్నారు. వీరందరికి టాటా ట్రస్టుల్లో సభ్యత్వం ఉంది. ఇండియన్ హోటల్స్‌కు వైస్‌ప్రెసిడెంట్‌గా లేహ వ్యవహరిస్తున్నారు. ఇక మాయా ట్రెంట్, స్టార్ బజార్ లీడర్‌షిప్ టీమ్‌లో చేస్తున్నారు. నెవిల్లె స్టార్‌బజార్, జుడియోను పర్యవేక్షిస్తున్నారు. కిర్లోస్కర్ కుటుంబానికి చెందిన మానసిని నెవిల్లె వివాహం చేసుకున్నారు.

**నోయల్ తల్లితో రతన్‌కు ఆత్మీయ అనుబంధం..**

రతన్‌కు సిమోనె సవతి తల్లి అయినా.. వారి మధ్య ప్రేమానుబంధాలు చాలా బలంగా ఉన్నాయి. పలు సందర్భాల్లో తన జీవితంలో వర్క్ ఎథిక్స్, కుటుంబ విలువలు నేర్చుకోవడంలో ఆమె ప్రభావం గురించి రతన్ టాటా చెబుతుండేవారు.

# ఎయిరిండియా విమానానికి 'ఎమర్జెన్సీ'.. ఉత్కంఠ నడుమ సేఫ్ ల్యాండింగ్




హైదరాబాద్ పెన్ పవర్:తిరుచ్చి: ఎయిరిండియా విమానం గాల్లో ఉండగా.. పైలట్లు ఎమర్జెన్సీ ప్రకటించడం ఒక్కసారిగా కలవరానికి గురిచేసింది. హైడ్రాలిక్ వ్యవస్థ పనిచేయడం లేదని గుర్తించిన పైలట్లు.. తిరుచ్చి విమానాశ్రయాన్ని అప్రమత్తం చేశారు. తమిళనాడులోని తిరుచ్చి నుంచి బయల్దేరిన కొద్ది సమయానికే ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో తిరుచ్చి ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్ కోసం ఏర్పాట్లు చేయడంతో ఉత్కంఠ పరిస్థితుల మధ్య సురక్షితంగా ల్యాండింగ్ చేశారు. ప్రయాణికులంతా సేఫ్‌గా ఉండటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.ఎయిరిండియా విమానం %ాఅదీ% 613 తిరుచ్చి నుంచి షార్జాకు శుక్రవారం సాయంత్రం బయలుదేరింది. ఆ సమయంలో విమానంలో 144 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. టేకాఫ్ అయిన కొద్ది సేపటికే హైడ్రాలిక్ వ్యవస్థ విఫలమైనట్లు పైలట్లు గుర్తించారు. ఈ విషయాన్ని ఏటీసీకి తెలియజేయడంతో అప్రమత్తమైన అధికారులు.. అత్యవసర ల్యాండింగ్‌కు అనుమతిచ్చారు.అత్యవసర పరిస్థితుల్లో విమానం సురక్షిత ల్యాండింగ్ కావాలంటే అందులో ఉన్న ఇంధనం నిర్దేశిత స్థాయి వరకు తగ్గాల్సి ఉంటుంది. అప్పుడే విమానం ల్యాండింగ్ చేసే వీలుంటుంది. ఈ నేపథ్యంలో సురక్షిత ల్యాండింగ్ కోసం ప్రయత్నించిన పైలట్లు.. దాదాపు రెండు గంటల పాటు విమానాన్ని గాల్లోనే చక్కర్లు కొట్టించారు. దీంతో ప్రయాణికుల భద్రతపై తీవ్ర ఆందోళన నెలకొంది. ఇదే సమయంలో ఏదైనా ప్రతికూల పరిస్థితి ఏర్పడితే ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు ముందస్తు ఏర్పాట్లును సైతం చేశారు. 20 అంబులెన్సులు, 20 అగ్నిమాపక యంత్రాలతోపాటు పారామెడికల్ సిబ్బందిని ఎయిర్‌పోర్టులో సిద్ధంగా ఉంచారు. అయితే, ఎట్టకేలకు ఎయిరిండియా విమానం సురక్షితంగా ల్యాండ్ కావడంతో ప్రయాణికులు, అధికారులు, ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

# మహిషమర్దనికి నవమి హారతులు.. దనుజహారిణికి దశమి పూజలు

**హైదరాబాద్ పెన్ పవర్:**యుగయుగాలుగా వెంటాడుతూ తరతరాల శిష్ట జనాలను బాధిస్తున్న అసుర మూకను సంహరించింది జగదంబిక. సృష్టిలో స్త్రీశక్తి ధైర్య స్థైర్యాలను చాటింది. అసురుల మీద వరుసగా ఒంటి చేత్తో ఎనిమిది రోజుల పాటు ఏకబిగిన యుద్ధం చేసిన ఆ అమ్మ నవమినాడు లోకకంటకుడైన మహిషాసురుణ్ణి మట్టుపెట్టింది. దశమినాడు దేవతలను అనుగ్రహిస్తూ రాజ రాజేశ్వరీదేవిగా అవతరించింది. భక్తుల పాలిట కరుణార్ద్రహృదయ అయిన రాజరాజేశ్వరీదేవి దశమినాటి జాబిలిలా ప్రకాశిస్తూ శ్రీమాతగా, శ్రీమహా రాజ్ఞిగా స్తుతులు అందుకుంటోంది. శ్రీమత్ సింహాసనేశ్వరిగా దర్శనమిచ్చి విశ్వశాంతిని వికసింపజేస్తోంది, విజయాలు చేకూరుస్తోంది. అందుకే దేవీనవరాత్రుల్లో మహానవమి, విజయ దశమి తిథులకు అంత ప్రాముఖ్యత వచ్చింది. ఆచార సంప్రదాయాలను అనుసరించి నవమి నాడు నవదుర్గలలోని సిద్ధిదాత్రిని, దశమినాడు రాజరాజేశ్వరీ మాతను అర్చిస్తుంటారు అమ్మవారి భక్తులు.

**ముగురమ్మల మూలపుటమ్మ.. చాల పెద్దమ్మ**

నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిదో రోజు మహా నవమి మహోత్సవం. దుర్గాదేవి రూపమైన సిద్ధిధాత్రిని ఈ రోజున ఆరాధిస్తారు. దుర్గామాత ఈ అవతారంలోనే మహిషాసురుణ్ణి మట్టి కరిపించి లోకానికి కల్యాణం చేకూర్చింది. భక్తుల కోర్కెలను సిద్ధింపచేస్తుంది. అందుకే ఆ చల్లని తల్లిని.. 'అమ్మలగన్నయమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ' అంటూ స్తుతిస్తాం. ఆ ముగ్గురమ్మలే మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి స్వరూపాలుగా పూజలు అందుకునే తల్లులు. 'చాల పెద్దమ్మ' అంటే మహాశక్తి స్వరూపిణి అని అర్థం. అండపిండ బ్రహ్మాండాలంతటా నిండిపోయిన శక్తిస్వరూపమే ఆమె. ఈ శక్తి స్వరూపిణి సమస్త జీవరాశుల్లోనూ ఇమిడి ఉంటుంది.

సృష్టి ప్రారంభంలో అవతరించిన దివ్యశక్తి త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను సృజించింది. లక్ష్మి, సరస్వతులను సృష్టించి విష్ణువు, బ్రహ్మలకు ఇచ్చింది. ఈ జగన్మాతను ఆరాధించే శివయ్య సకల సిద్ధులనూ పొందాడు. తనలో సగం



చేసుకుని శివుడు అర్ధనారీశ్వరుడు అయ్యాడు. శివుని శరీరంలో ఎడమ వైపున ఉండే తల్లే సిద్ధిదాత్రీ దేవి అన్నది సాధకుల విశ్వాసం. ఆ శక్తిస్వరూపిణి అతీంద్రియ శక్తులను సైతం సిద్ధింపచేస్తుంది.

**సిద్ధిధాత్రి రూప విలాసం**

మహానవమి నాడు పూజలందుకునే దుర్గమ్మ సిద్ధిధాత్రి రూపంలో నాలుగు చేతులతో పద్మం మీద కూర్చుని ఉంటుంది. కమలం, గద, శంఖ, చక్రాలను ధరించి ఉంటుంది. ఈ రూపంలో దుర్గ అజ్ఞానాన్ని తొలగించి బ్రహ్మన్ని గ్రహించేందుకుగానూ జ్ఞానాన్ని అందిస్తుంది. చుట్టూ ఉన్న సిద్ధులు, గంధర్వులు, యక్షులు, దేవతలు, రాక్షసులు అమ్మను పూజిస్తుంటారు. అణిమ (దేవునికి సమానమైన కీర్తిని గడించటం), మహిమ (ఘనత వహించే శక్తి), గరిమ (బరువును పెంచుకోగల శక్తి), లఘిమ (బరువును తక్కువచేసి చూపగల శక్తి), ప్రాప్తి (అదృష్టం), ప్రాకామ్యం (దూర దర్శనం, దూర శ్రవణం, ఆకాశ గమనం తదితర శక్తులు), ఈశాత్వం (దిక్పాలకులను నియంత్రించే శక్తి), వశిత్వం (సకల జీవరాశులనూ అదుపుచేయగల శక్తి) అనే ఎనిమిది అతీంద్రియ శక్తులు ఈ తల్లి వశంలోనే ఉంటాయి. ఈ కారణం వల్లే శక్తి స్వరూపాలైన ఆయుధాలకు నవమినాడు భక్తిగా ఆయుధ పూజలు చేస్తుంటారు.

**చల్లని తల్లి దుర్గమ్మ**

మహిషమర్దనం తరువాత విశ్వశాంతి కోసం తన రౌద్ర రూపాన్ని విడిచి చల్లని తల్లిగా దుర్గమ్మ అవతరించి భక్తులను కరుణిస్తోంది. అప్పటి ఆ అమ్మ రూపమే రాజరాజేశ్వరి. పరమేశ్వరుని అంకాన్ని ఆసనంగా చేసుకుని, చేతిలో చెరకుగడతో, చిరుదరహాసంతో శోభాయమానమై ప్రకాశించే జగన్మాతను భక్తితో పూజించాలి. అనంతశక్తి స్వరూపిణి అయిన ఈ తల్లిని ప్రసన్నం చేసుకోవడానికి కుంకుమార్చనలు, సువాసినీ పూజలు చేస్తుంటారు.

**అవి కూడా విజయోత్సవాలే!**

అమ్మవారు మహిషాసురుణ్ణి వధించిన రోజు విజయదశమి అన్నది ప్రశస్తం. కానీ ఆయా పురాణాలను అనుసరించి ఇతర సందర్భాలూ ఉన్నాయి. పాల సముద్రం నుంచి అమృతభాండం ఆవిర్భవించిన రోజే విజయదశమి అన్నారు. త్రేతాయుగంలో రావణాసురుణ్ణి శ్రీరాముడు సంహరించిన రోజును విజయ దశమిగా చెప్పారు. ద్వాపర యుగంలో పాండవులు అజ్ఞాతవాసానికి ముందు తమ ఆయుధాలను శమీవృక్షం తొర్రలో ఉంచారు. తిరిగి వచ్చిన అనంతరం ఆ చెట్టుకు పూజచేసి, ఆయుధాలను తీసుకున్నారు. యుద్ధంలో కౌరవులపై విజయం పొందిన రోజే విజయదశమి అని కూడా చెబుతారు.

రాజరాజేశ్వరీదేవి స్వప్రకాశ జ్యోతి స్వరూపిణి. ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులను ఈ మూర్తి తన భక్తులకు వరాలుగా అనుగ్రహిస్తుంది. ఈమె యోగమూర్తి. అనంతశక్తి స్వరూపమైన శ్రీచక్రానికి అధిష్ఠాన దేవత. రాజరాజేశ్వరీ అష్టకంలో ఆదిశంకరాచార్యులు అమ్మ రూప గుణ లావణ్యాలను వివరించారు.

విజయదశమి సందర్భంగా అమ్మవారికి కలశం పెట్టి, శ్రీరాజరాజేశ్వరీ అష్టోత్తరం పఠిస్తూ పూజలు చేసి, ఆ తల్లికి ఇష్టమైన లడ్డూతో పాటు షడ్రసోపేతమైన భోజన పదార్థాలతో మహానివేదన చేస్తారు. విజయదశమిరోజు అమ్మవారికి సామూహికంగా అర్చనలు చేసి, ఉద్వాసన పలికి, నిమజ్జనం చేసే సంప్రదాయం కూడా ఉంది.

శరన్నవరాత్రి మహోత్సవాల్లో అమ్మవారిని రోజుకో రూపంగా అలంకరించడం తెలిసిందే. చివరి అలంకారంగా శ్రీ రాజరాజేశ్వరీదేవిని దర్శింపచేస్తారు. సకల భువన బ్రహ్మాండాలకు రాజరాజేశ్వరీదేవి ఆరాధ్య దేవత. మహాత్రిపురసుందరిగా, అపరాజితాదేవిగా కూడా భక్తులు పూజిస్తారు. రాజరాజేశ్వరీ అమ్మవారిని పూజించే వారికి విజయాలు కలుగుతాయని దేవీపురాణం తెలియచేస్తోంది. ఈ పర్వదినాల్లోనే కాదు.. నిత్యం అమ్మను స్మరించి, సుఖసంతోషాలతో వర్ధిల్లుదాం.

# భారీగా లిక్కర్ సేల్స్.. ఎప్పుడూ లేనంత రికార్డు స్థాయిలో

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో భారీగా మద్యం అమ్మకాలు జరిగాయి. ఎన్నడూ లేనంతగా దసరా పండగకు లిక్కర్ సేల్స్ జరిగాయి. దసరా పండగకు ఎక్కువ మంది సొంతూళ్లకు వెళ్లి ఎంజాయ్ చేయడం అలవాటు. బంధువులు, చిన్ననాటి స్నేహితులందరూ కలిసి పార్టీలు చేసుకోవడం కొన్నేళ్లుగా తెలంగాణ పల్లెల్లో నడుస్తుంది. దసరా రోజు మద్యంతో పాటు మాంసంతో అందరూ కలిసి భోజనం చేయడం కూడా అలవాటే. అందుకే మద్యం ఎక్కువగా అమ్ముడవుతుందని ఎక్సైజ్ అధికారులు ముందుగానే అంచనా వేసి మరీ ఎక్కువ స్థాయిలో మద్యం బాటిల్స్ ను అందుబాటులో ఉండేలా చేయడంతో ఒక్కసారిగా సేల్స్ పెరిగాయి.

**ఏపీకి వెళ్లేవారు...**

గ్రామాల్లో లిక్కర్ షాపులుండకపోవడంతో హైదరాబాద్ జిల్లా కేంద్రాల నుంచి మద్యం బాటిల్స్ ను ఎక్కువగా కొనుగోలు చేసుకుని తీసుకెళుతుంటారు. గ్రామాల్లో ఒకవేళ లభించినా చీప్ లిక్కర్ లభిస్తుండటంతో హైదరాబాద్ నుంచి బ్రాండెడ్ మద్యం బాటిల్స్ ను ఎక్కువ మంది కొనుగోలు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. దసరా పండగ తెలంగాణలో పెద్ద పండగ కావడంతో పాటు అందరూ కలిసి సెలబ్రేట్ చేసుకుంటారు. అందుకే ఈ పండగకు మద్యం సేల్స్ ఎక్కువయ్యాయంటున్నారు ఎక్సైజ్ అధికారులు. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్ కు వెళ్లే వారు కూడా అక్కడ మద్యం బాటిల్స్ బ్రాండెడ్ వి దొరుకుతాయో? లేదోనని భావించి ఒకటో రెండో తమ వెంట తీసుకెళుతున్నారు.

**దసరాకు ముందు...**

దీంతో దసరాకు ముందు భారీగా మద్యం అమ్మకాలు పెరిగినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. దసరా సెలవులు దాదాపు పదిహేను రోజులు ఇవ్వడంతో ఇప్పటికే గ్రామాల బాట పట్టారు జనం. అందుకే గత తొమ్మిది రోజుల నుంచి మద్యం అమ్మకాలు 713 కోట్ల రూపాయల మేర జరిగాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ




స్థాయిలో మద్యం అమ్మకాలు జరగడం రికార్డు బ్రేక్ అని అంటున్నారు. ప్రభుత్వానికి ఆదాయం భారీగా లభించడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈరోజు, రేపు మరింతగా మద్యం అమ్మకాలు పెరుగుతాయన్న అంచనాలో ఎక్సైజ్ అధికారులున్నారు.

## అమ్మవారి ఆలయంలో అపచారం షూ వేసుకోనే పోలీసు డ్యూటీ

**హైదరాబాద్ పెన్ పవర్:**ఇంద్రకీలాద్రిలో పోలీసులు కాళ్ళకి షూ వేసుకుని అమ్మవారి ఆలయ ముఖద్వారం వద్ద డ్యూటీ చేస్తున్నారు. ఆలయ పవిత్రతను దెబ్బతీస్తున్నారు. ఆలయాల పవిత్రతను కాపడుతాం అని సిఎం, మంత్రులు చెపుతున్నా ఆచరణలో కనపడని వైనం. అమ్మవారి ఆలయ ముఖద్వారం వద్ద పోలీసులు షూ వేసుకుని డ్యూటీ చేయడం పై భవానిల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. షూ వేసుకుని డ్యూటీ చేస్తున్న పోలీసుల పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఆలయ ముఖద్వారం వద్ద షూ వేసుకుని డ్యూటీ చేస్తున్నా ఆలయ అధికారులు చూసి చూడనట్టు ఉన్నారు. ఇంద్రకీలాద్రి పై భక్తుల కన్నా పోలీసులు ఎక్కువ ఉన్నారు అంటూ భక్తులు మండిపడుతున్నారు.

## భక్తుల మనోరథాన్ని అధిరోహించిన దేవదేవుడు

### వేడుకగా రథోత్సవం

### భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగిన భక్తులు

**హైదరాబాద్ పెన్ పవర్:** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో ఎనిమిదో రోజైన శుక్రవారం ఉదయం 7 గంటలకు ఉభయదేవేరులతో కూడిన శ్రీ మలయప్పస్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి రథాన్ని లాగారు.బ్రహ్మోత్సవాలలో ఎనిమిదో రోజున ఉభయ దేవేరులతో మలయప్పస్వామిని మహోన్నత రథంపై అధిష్ఠింపజేసి ఆలయ వీథులలో విహరింపజేశారు. శ్రీవారికి భక్తులు అడుగడుగునా నీరాజనాలు సమర్పించారు. గోవిందనామస్మరణతో ఆలయ మాడవీథులు మారుమోగాయి.తిరుమలలో రథోత్సవం అన్నివిధాలా ప్రసిద్ధమైనది. "రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మనవిద్యతే" అన్న ఆర్షవాక్కులు రథోత్సవం మోక్షప్రదాయకమని వివరిస్తున్నాయి. తిరుమాడ వీథులలో రథాన్ని లాగేటప్పుడు ప్రమాదాలు జరుగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. రథానికి తాళ్ళుకట్టి వీధులలో భక్తులు, అధికారులు అందరూ రథాన్ని ముందుకు లాగారు.రథోత్సవానికి విశిష్టమైన ఆధ్యాత్మికార్థం ఉంది. కఠోపనిషత్తులో ఆత్మకు, శరీరానికీ ఉండే సంబంధాన్ని రథరూపకల్పనతో వివరించడం జరిగింది. ఆత్మ రథికుడు, శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలే గుర్రాలు, విషయాలే వీథులు. ఈ రీతిలో శరీరాన్ని రథంతో పోల్చడంతో – స్థూలశరీరం వేరనీ, సూక్ష్మశరీరం వేరనీ, ఆత్మ అందుకు భిన్నమనే ఆత్మానాత్మ వివేకం కలుగుతుంది. రథోత్సవంలో ముఖ్యంగా కలిగే తత్త్వజ్ఞానమిదే. భక్తులు రథాన్ని లాగుతారు, కానీ, అన్నమయ్య సకలజీవులలో అంతర్యామిగా ఉన్న పరమాత్మ తనరథాన్ని తానే లాగుతున్నాడని అనడం సముచితం.

## రతన్ టాటా మరణం దేశానికి తీరని లోటు.

**సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్**

**హైదరాబాద్ పెన్ పవర్:** రతన్ టాటా మరణం మన భారత దేశానికి తీరని లోటు అని తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ పేర్కొన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కార్యాలయంలో సంతాప సభ జరిపి ఆయన ఫోటోకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు రతన్ టాటా పెట్టింది పేరని,విద్య,వైద్యం,పారిశుధ్యం,జంతు సంక్షేమం వంటి రంగాల్లో వారి దాతృత్వం మరువలేనిదన్నారు.అందులో ముఖ్యమైనది కరోనా కష్టకాలంలో దేశంలో కరోనా నుంచి ప్రజలు కొలుకోవడానికి రూ.15 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వంకు అందించారని, సమాజాభివృద్ధి దిశగా చేసిన ఆ మహనీయుని జీవన ప్రయాణం ...భవిష్యత్ తరాలకు కూడా స్ఫూర్తిని అందిస్తునే ఉంటుందని సంతాపం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు మాజీ మున్సిపల్ చైర్మన్ జీ.ఆర్.దేశాయ్,జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విష్వనాథం,కోశాధికారి వెల్మల ప్రకాష్ రావు,నాయకులు పి.సి.హన్మంత్ రెడ్డి,సింగం గంగాధర్,భాస్కర్,ఎం.డి. యాకూబ్,దేవేందర్ రావు,పబ్బా శివానందం,రాజ్ మోహన్,సతీష్ రాజ్,మానాల కిషన్, పాల్గొన్నారు.

# రాజకీయాల్లోకి నటుడు షాయాజీ షిండే



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ నటుడు షాయాజీ షిండే రాజకీయ అరంగేట్రం చేశారు. అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ముంబయిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్‌సీపీ చీఫ్, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి సాదర స్వాగతం పలికారు. మరికొన్ని నెలల్లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. దీంతో ఈ ఎన్నికల్లో షిండే పోటీ చేసే అవకాశం ఉందనే ఊహాగానాలు వినబడుతున్నాయి. అయితే, పార్టీలో ఆయనకు తగిన ప్రాధాన్యం కల్పిస్తామని అజిత్ పవార్ వెల్లడించారు. పార్టీ తరపున స్టార్ క్యాంపెయినర్‌గా షిండే ఉంటారని తెలిపారు.

ఈ సందర్భంగా షిండే మాట్లాడుతూ.. తాను ఎన్నో సినిమాల్లో రాజకీయ నాయకుడిగా నటించానని గుర్తు చేసుకున్నారు. అజిత్ పవార్ నడవడిక తనను ఆకర్షించిందని చెప్పారు. మొక్కలు నాటే కార్యక్రమం గురించి పవార్‌తో చర్చించిన క్షణాలను గుర్తు చేసుకున్నారు. మరింత సమవర్థవంతంగా పని చేసేందుకే పార్టీలో చేరానన్నారు.

**షిండే సినీ ప్రస్థానమిదీ..**

షాయాజీ షిండే.. మహారాష్ట్రలోని ఓ గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించారు. తన చదువు కొనసాగిస్తూనే ఆ రాష్ట్ర ప్రభుత్వ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో కొన్నాళ్లపాటు వాచ్‌మెన్‌గా పని చేశారు. ఆ సమయంలోనే ఆయనకు నటనపై ఆసక్తి ఏర్పడింది. అలా 1978లో మరాఠీ నాటకాలతో తన కెరీర్‌ను ప్రారంభించారు. 1995లో మరాఠీ చిత్రంతో తెరంగేట్రం చేశారు. హిందీ, తమిళం, కన్నడ, భోజ్‌పురి, ఇంగ్లిష్‌లోనూ ఆయన నటించి మెప్పించారు. 'ఠాగూర్', 'అతడు', 'పోకిరి' వంటి అనేక తెలుగు హిట్ మూవీస్‌లో ఆయన విభిన్నమైన పాత్రలు పోషించి తెలుగువారికి సుపరిచితమయ్యారు. షిండే కీలక పాత్ర పోషించిన తాజా చిత్రం 'మా నాన్న సూపర్‌హీరో' శుక్రవారం విడుదలైంది. షిండే బాడీ లాంగ్వేజ్‌కే కాదు గాత్రం కూడా ఆయన్ను ప్రత్యేకంగా నిలిపింది.

**షిండే సూచనను స్వాగతించిన పవన్ కల్యాణ్**

ఆలయాల్లో ప్రసాదంతో పాటు భక్తులకు ఒక మొక్కను కూడా ఇవ్వాలంటూ షిండే చేసిన సూచనను ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వాగతించిన సంగతి తెలిసిందే. తన మాతృమూర్తి జ్ఞాపకంగా మహారాష్ట్రలోని మూడు ఆలయాల్లో ఆ విధానాన్ని అనుసరిస్తున్నట్టు షిండే ఓ కార్యక్రమంలో వెల్లడించారు. చెట్లు, అవి అందించే ఫలాలు చూస్తే తన తల్లి గుర్తుకొస్తుందన్నారు.

# వంజరి కుల విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో రాణించాలి

### తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం డైరెక్టర్ బొమ్మెల శంకర్

### రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన వంజరి కుల విద్యార్థినిలకు నగదు ప్రోత్సాహకాలు అందజేత

**హైదరాబాద్ పెన్ పవర్:**వంజరి కుల విద్యార్థులు సమాజంలో విద్యకు ప్రముఖ్యతను గుర్తించి ఉన్నత చదువుల్లో ఉత్తమ ప్రతిభతో రాణించాలని తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం డైరెక్టర్ బొమ్మెల శంకర్ అన్నారు.ప్రతి సంవత్సరం ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం పదవ తరగతి మొదలుకొని ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జి పి ఏ, స్టేట్ ర్యాంకులు సాధించిన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తమ వంజరి కుల విద్యార్థినిలకు ఒక్కొక్కరికి నగదు రూ.లు 10,000 ప్రోత్సాహకాలు అందజేస్తుండగా గత విద్యాసంవత్సరం 2023 – 2024 కు గాను జగిత్యాల జిల్లాలో జీపిఏ, స్టేట్ ర్యాంకులు సాధించిన వంజరి విద్యార్థినిలకు రాష్ట్ర సంఘం ద్వారా మంజూరైన నగదు ప్రోత్సాహకాలను జిల్లా నుండి ఎంపికైన 14మంది కుల విద్యార్థినిలకు అందజేసే కార్యక్రమాన్ని శుక్రవారం జగిత్యాల జిల్లా కోరుట్ల మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో రాష్ట్ర వంజరి సంఘం డైరెక్టర్, జగిత్యాల జిల్లా వంజరి సంఘం అధ్యక్షులు బొమ్మెల శంకర్ ఆధ్వర్యంలో రాష్ట్ర డైరెక్టర్ లు ఆరె శంకర్, ముస్కరి తుకారాం లు ఏర్పాటు చేశారు.ఈసందర్బంగా బొమ్మెల శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర వంజరి సంఘం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఉన్నత చదువుల్లో రానించిన వంజరి భావితరాల విద్యార్థులకు తన చేతులమీదుగా ఈ ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేయడం తనకు సంతోషంగా ఉందని అన్నారు. సామజిక వెనుకబాటుతనాన్ని అనుభవిస్తున్న వంజరి కుసుమాలు పోటీ ప్రపంచంలో ప్రభుత్వ పాఠశాలలు కళాశాలల్లో, సాధారణ విద్యాసంస్థలలో చదివినా కార్పొరేట్ విద్యాసంస్థల విద్యార్థులకు దీటుగా చదువుల్లో రానిస్తూ ఉత్తమ ప్రతిభను చాటుతున్నారని అన్నారు. అయితే పాలకులు,ప్రభుత్వాలు గుర్తించి చేయూతనిస్తే వంజరి కుల విద్యార్థులు మరింత మెరుగ్గా చదివి సమాజానికి ఉపయోగపడుతూ దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తారని ఆయన పేర్కొన్నారు.వంజరి విద్యార్థులు ఇదే స్ఫూర్తితో మరిన్ని పోటీ పరీక్షల్లో నెగ్గి జీవితంలో డాక్టర్లుగా, ఇంజనీర్, శాస్త్రవేత్తలుగా దేశానికి సేవచేయాలనీ బొమ్మెల శంకర్ ఆకాంక్షించారు.అనంతరం నగదు పురస్కారాలను అందుకొన్న 14 మంది విద్యార్థినిలను నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈసందర్బంగా నగదు ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థినిలు వారి తల్లిదండ్రులు తెలంగాణ వంజరి సంఘం అధ్యక్షులు కాలేరు నరేందర్, ప్రధాన కార్యదర్శి కంధారి వెంకటేశం, కోశాధికారి కాలేరు అమరేందర్ మరియు రాష్ట్ర, జిల్లా సంఘాల కార్యవర్గమునకు ధన్యవాదములు తెలిపారు. ఈకార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం డైరెక్టర్ లు ఆరె శంకర్, ముస్కరి తుకారాం, జిల్లా నాయకులు నవాతు రాజేందర్, లవంగ సాగర్, నల్లా వెంకటేశ్వర్లు వివిధ మండలాల నుండి వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రవాసీ ప్రజావాణి' నిర్వహణకు మార్గదర్శకాలు జారీ

- స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ఉత్తర్వుల ప్రతులను విడుదల చేసిన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా. జి.చిన్నారెడ్డి
- ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వ్యవస్థ బలోపేతం కోసం ప్రభుత్వం చర్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో కొనసాగుతున్న ప్రజావాణి కార్యక్రమంలో గల్ఫ్ ఇతర గమ్యస్థాన దేశాల కార్మికులు, ఎన్నారైల కోసం ఏర్పాటు చేసిన 'ప్రవాసీ ప్రజావాణి' ఫిర్యాదుల స్వీకరణ కేంద్రం నిర్వహణకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రజావాణి ప్రతి మంగళవారం, శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తున్న సంగతి తెల్సిందే.

గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం సెప్టెంబర్ 16న జారీ చేసిన జీవో నెం.205 కు కొనసాగింపుగా సాధారణ పరిపాలన శాఖ లోని ప్రవాస భారతీయుల (జీఏడి – ఎన్నారై) విభాగం పక్షాన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఈనెల 9న స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపి) మార్గదర్శకాల మెమో జారీ చేశారు. 'ప్రవాసీ ప్రజావాణి' లో స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారానికి సంస్థాగతంగా ప్రామాణికరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

'ప్రవాసీ ప్రజావాణి' నిర్వహణ మార్గదర్శకాల ఉత్తర్వుల ప్రతులను శుక్రవారం ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా. జి. చిన్నారెడ్డి విడుదల చేశారు. టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి, దుబాయి లోని గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి అధ్యక్షులు గుండెల్లి నర్సింలు, స్వచ్ఛంద సేవకులు శాంతిప్రియ యాదవ్ (మలేసియా), బషీర్ అహ్మద్ (ఓమాన్ రిటనీ) తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 'ప్రవాసీ ప్రజావాణి' నిర్వహణకు చక్కటి ఏర్పాటు చేసిన ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జి. చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్యా దేవరాజన్ కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

### 'ప్రవాసీ ప్రజావాణి' మార్గదర్శకాలు

గల్ఫ్, ఇతర గమ్యస్థాన దేశాల కార్మికులు, ఎన్నారైల కోసం ఏర్పాటు చేసిన 'ప్రవాసీ ప్రజావాణి' ఫిర్యాదుల స్వీకరణ కేంద్రంలో విదేశాల్లో ఉన్న బాధితుల పక్షాన వారి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయవచ్చు. తదుపరి చర్యల కోసం ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపిస్తారు.

### జీఏడి – ఎన్నారై విభాగం పరిధిలో:

గల్ఫ్ తదితర దేశాల నుంచి మృతదేహాలను ఇండియాకు తెప్పించడం, విదేశాల నుంచి వచ్చిన శవపేటికలను హైదరాబాద్ విమానాశ్రయం నుంచి స్వగ్రామం వరకు ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేయడం

(దారిద్ర రేఖకు దిగువన – బీపీఎల్ వారికి), పేషేంట్లను స్వదేశానికి రవాణా చేయడం, విదేశీ జైళ్లలో ఉన్నవారికి న్యాయ సహాయం చేసి విడుదలకు కృషి చేయడం, వీసా గడువును మించి (ఓవర్ స్టే) అక్కడే నివసించడం, అత్యవసర పరిస్థితులు, క్షమాభిక్ష (ఆమ్నెస్టీ), జీతం బకాయిలు ఇప్పించ డం, విదేశాలలో మన వారికి అవసరమైన అన్నిసేవలను జీఏడి – ఎన్నారై విభాగం నేరుగా పర్యవేక్షిస్తుంది. విదేశాలలోని భారత రాయబార కార్యాలయాలు, ఢిల్లీలో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో అనుసంధానము చేస్తుంది. ఈ సేవలు వినియోగించుకోవడానికి తెల్ల కాగితంపై దరఖాస్తు, పాస్ పోర్ట్ మొదటి పేజీ అడ్రస్ పేజీ, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, విదేశంలోని వివరాలు, తెలంగాణలోని కుటుంబ వివరాలు మొబైల్ నెంబర్లు సమకూర్చాలి.

### ఎన్నారై మహిళా పోలీస్ విభాగం పరిధిలో:

విదేశాల్లోని ఎన్నారై కుటుంబ వివాదాల పరిష్కారం గురించి వచ్చిన దరఖాస్తులను తదుపరి చర్యల కోసం హైదరాబాద్ లక్డీకాపూల్ లోని పోలీస్ కార్యాలయంలోని ఎన్నారై విమెన్ సెల్ కు పంపిస్తారు. ఈ సేవలు వినియోగించుకోవడానికి తెల్ల కాగితంపై దరఖాస్తు, పాస్ పోర్ట్ మొదటి పేజీ అడ్రస్ పేజీ, ఆధార్ కార్డు, మ్యారేజ్ సర్టిఫికెట్, పోలీస్ ఎఫ్ఐఆర్, విదేశంలోని వివరాలు, తెలంగాణలోని కుటుంబ వివరాలు మొబైల్ నెంబర్లు సమకూర్చాలి.

### ఏజెంట్ల మోసాలు – పోలీస్ శాఖ పరిధిలో:

నకిలీ ఏజెంట్లు, చీటింగ్ కేసులు, విదేశాలకు సంబంధించిన ఇతర సారూప్య సమస్యలపై తదుపరి చర్యల కోసం సంబంధిత కమిషనర్ ఆఫ్ పోలీస్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కు బదిలీ చేస్తారు. ఈ సేవలు వినియోగించుకోవడానికి తెల్ల కాగితంపై దరఖాస్తు, పాస్ పోర్ట్ తదితర వివరాలు అందజేయాలి.

### గల్ఫ్ మృతులకు రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా

రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా (మృతధన సహాయం) కోసం గల్ఫ్ దేశాలలో చనిపోయిన వ్యక్తి జీవిత భాగస్వామి (భార్య / భర్త), పిల్లలు, తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ విజ్ఞప్తిని సంబంధిత జిల్లా కలెక్టర్లకు బదిలీ చేస్తారు. నేరుగా జిల్లా కలెక్టర్లకు దరఖాస్తు చేసుకోవడం మంచిది. తెల్లకాగితంపై అభ్యర్థన లేఖ, పాస్ పోర్ట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, భారత రాయబార కార్యాలయాలు జారీ చేసిన మరణ ధ్రువీకరణ పత్రం, కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించాలి.

### గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్లు:

గల్ఫ్ కార్మికుల పిల్లలకు ప్రభుత్వ గురుకుల పాఠశాలలలో అడ్మిషన్ల కొరకు వచ్చిన దరఖాస్తులను తదుపరి చర్యల కోసం విద్యా శాఖకు బదిలీ చేస్తారు. తెల్ల కాగితంపై దరఖాస్తు, పాస్ పోర్ట్ మొదటి పేజీ అడ్రస్ పేజీ, ఆధార్ కార్డు, విద్యార్థి సర్టిఫికెట్లు సమర్పించాలి.

# రతన్ టాటాకు భారతరత్న ఇవ్వాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ వ్యాపారవేత్త, పరిశ్రమల అధినేత, దివంగత రతన్ టాటాకు భారతరత్న ఇవ్వాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సంఘ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం జగిత్యాల జిల్లా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చౌరస్తాలో దివంగత నేత రతన్ టాటా కు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సంఘ నాయకులు ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రతన్ టాటా దేశానికి ఎన్నో సేవలు అందించారన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సిద్ధాంతాలు కలిగిన వ్యక్తి రతన్ టాటా అని తెలిపారు. ఆయన వ్యాపార, పరిశ్రమలలో వచ్చే లాభాలను ప్రజా అవసరాలకు

అందించే వారిని అన్నారు. ఆయన వివిధ స్వచ్ఛంద సంస్థలకు లక్షల కోట్ల రూపాయలు అందించారన్నారు. ప్రతి వంద రూపాయల్లో 65 రూపాయలు వివిధ సంక్షేమాల కోసం అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆయన ప్రజా సేవ కోసమే తపించేవాడని ప్రజలకు కావలసిన విద్య ,వైద్యం, గ్రామ అభివృద్ధి కోసం నిధులు ఇచ్చే వారన్నారు. అలాంటి మహా మనిషికి కేంద్ర ప్రభుత్వం వెంటనే భారతరత్న ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర నాయకులు ఉయ్యాల నరసయ్య, బలిజ రాజారెడ్డి , డివిజన్ అధ్యక్షుడు ఉయ్యాల శోభన్, గురు మంతుల నారాయణ, సామల వేణుగోపాల్, ఎడ్ల ప్రభాకర్, దామ శ్రావణ్, జాగిలం శంకర్, సామల దశరథం తదితరులు పాల్గొన్నారు.

# మందలించిందని తల్లిని కొట్టి చంపిన కొడుకు

**హైదరాబాద్ పెన్ పవర్:** తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం కమ్మవారిపాలెం గ్రామంలో దారుణ ఘటన చోటుచేసుకుంది, నవ మాసాలు మోసి జన్మనిచ్చి జీవిత చరమాంకంలో తోడుగా ఉంటాడనుకున్న కొడుకు కాలయముడయ్యాడు క్రూర మృగంలా మారి తల్లిని దారుణంగా కొట్టి చంపాడు,గురువారం రాత్రి సుమారు 8 గంటల ప్రాంతంలో కొడుకు మనోజ్ (22సం")ను తల్లి సుశీలమ్మ మందలించడంతో విచక్షణ కోల్పోయిన మనోజ్ క్రూర మృగం లా మారదు,కర్రతో తల్లి తలపై విచక్షణారహితంగా కొట్టడంతో ఆమె తీవ్ర గాయాలు పాలయ్యారు, వైద్యం కోసం సుశీలమ్మను మొదట గూడూరుకు తర్వాత నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆమె మరణించింది,దీంతో చిల్లకూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు....

# ఏపీకి తుఫాను ముప్పు.. మూడు రోజులు భారీ వర్షాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రానికి మరో తుఫాను ముప్పు పొంచి ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఏపీని వర్షాలు వణికిస్తున్నాయి. వరుస తుపానుల ప్రభావంతో ఇటీవల వరకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు దంచికొట్టాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయంకాగా.. నదులు, వాంగులువంకలు పొంగిపొర్లి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు, వరదల కారణంగా పలువురు మృత్యువాత పడ్డారు. పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆ నష్టాల నుంచి తేరుకోకముందే మరోసారి ఏపీలో భారీ వర్షాలు కురవబోతున్నాయి.దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఈ నెల 14 నుంచి 16 వరకు భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. మరోవైపు అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం రెండు, మూడు రోజుల్లో వాయుగుండంగా బలపడుతుందని పేర్కొంది. దీని ప్రభావం తో తెలుగు రాష్ట్రాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.

# సోమశిల సమీపంలో 93 ఎర్రచందనం దుంగలు స్వాధీనం రెండు కార్లుతో 5గురు అరెస్ట్

**హైదరాబాద్ పెన్ పవర్:** జిల్లా సోమశిల సమీపంలో 93 ఎర్రచందనం దుంగలు, రెండు కార్లు స్వాధీనం చేసుకుని, ఐదుగురు స్మగ్లర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్ ఫోర్స్ ఇంచార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాలు మేరకు, టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ జి. బాలిరెడ్డి మార్గదర్శకత్వంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. వారి ద్వారా రాబడిన విశ్వసనీయ సమాచారం తో ఆర్ ఐ (ఆపరేషన్స్)కె. సురేష్ కుమార్ రెడ్డి టీమ్స్ లోని ఆర్ ఎస్ ఐలు కె. సురేష్ బాబు, టి.విష్ణు వర్ధన్ కుమార్ బృందం సోమశిల–అనంత సాగరం మార్గం లో ఐదుగురు వ్యక్తులను పట్టుకున్నారు. వారిలో నలుగురిని తమిళనాడు తిరువన్నామలై జిల్లా, ఒకరిని పాండిచ్చేరి వాసులు గా గుర్తించారు. వారి నుంచి 93ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వారిని టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించగా, ఎస్ ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆపరేషన్ లో పాల్గొన్న సిబ్బందికి ఎస్పీ రివార్డులు ప్రకటించారు. ఇందులో ముఖ్యులపై పీడీ యాక్ట్ నమోదు చేయడానికి సిద్ధం చేస్తున్నారు.

## తహసీల్దార్ల బదిలీలకు ఆదేశాలు.

హైదరాబాద్ పెన్ పవర్:అసెంబ్లీ,పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సుదూర ప్రాంతాలకు బదిలీ అయిన తహశీల్దార్లను తిరిగి పూర్వ జిల్లాలకు బదిలీ చేసేందుకు అప్షన్లు పంపించాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు సీ సీ ఎల్.ఏ.నవీన్ మిట్టల్ ఆదేశాలు జారీ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం పై జిల్లా ట్రెసా అధ్యక్షుడు ఎం.డీ.వకీల్,ప్రధాన కార్యదర్శి నవీన్,కోశాధికారి కృష్ణ,మాజీ ట్రెసా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ లు హర్షం వ్యక్తం చేశారు.రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,సీ సీ ఎల్.ఏ.నవీన్ మిట్టల్,బదిలీలకు కృషి చేసిన ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగా రవీందర్ రెడ్డికి,ప్రధాన కార్యదర్శి గౌతమ్ కుమార్ లకు ట్రెసా జిల్లా కార్యవర్గం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు.

## పోలీసుల అదుపులో నైజీరియన్ మహిళ

హైదరాబాద్ పెన్ పవర్: రాజేంద్రనగర్ బండ్లగూడ పి అండ్ టి కాలనీ లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. నైజీరియన్స్ ఉండేప్రాంతంలో దాడులు నిర్వహించారు. వీసా, పాస్ పోర్టులను క్షుణ్ణంగా పరిశీలించారు. వీసాముగిసినప్పటికీ ఇండియా లో ఉంటున్న ఓ నైజీరియన్ లేడిని గుర్తించారు. ఆమెను రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ కుతరలించారు. పోలీసుల అదుపులో నైజీరియన్ లేడి వుంది.

## జిల్లా ప్రజలకు, పోలీసులకు విజయ దశమి శుభాకాంక్షలు ఎస్పీ జి. బిందు మాధవ్

హైదరాబాద్ పెన్ పవర్:జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులు , సిబ్బందికి, పోలీసు కుటుంబ సభ్యులకు కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ శుక్రవారం విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. విజయాలకు చిహ్నమైన ఈ విజయదశమి అన్ని రంగాల్లో అందరికి విజయం చేకూరాలని , సుఖ సంతోషాలతో ఆనందంగా దసరా పండుగను జరుపుకోవాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ జి . బిందు మాధవ్ ఐపీఎస్ గారు ఆకాంక్షించారు.

## జమిలి ఎన్నికలు వద్దు కేరళ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం





హైదరాబాద్ పెన్ పవర్:తిరువనంత పురం– దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించడానికి కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను కేరళ ప్రభుత్వం వ్యతిరేకించింది. ఇది అప్రజాస్వామ్యం, రాజా ?యంగ విరుద్ధమంటూ పేర్కొంది. ఒకే దేశం–ఒకే ఎన్నిక నినాదంతో దేశంలో ఏకకాలంలో అన్ని ఎన్నికలు జరపాలంటూ కోవింద్ కమిటీ చేసిన సిఫార్సులను కేంద్రం ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తూ కేరళ అసెంబ్లీ గురువారం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ తరపున మంత్రి ఎంబీ రాజేశ్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ అజెండాకు అనుకూలంగానే దీనిని అమలు చేయడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని రాజేశ్ విమర్శించారు.

## ప్రధాని మోదీ బహుమతిగా ఇచ్చిన కిరీటం చోరీ

హైదరాబాద్ పెన్ పవర్:బంగ్లాదేశ్‌లోని జెశోరేశ్వరి ఆలయంలోని కాళీ మాత కిరీటం చోరీకి గురైంది. ఈ కిరీటాన్ని 2021లో బంగ్లాదేశ్‌కు వెళ్లిన సమయంలో ప్రధాని మోదీ దీనిని బహుమతిగా ఇచ్చారు. గురువారం మధ్యాహ్నం ఈ దొంగతనం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఆలయ సీసీటీవీ వీడియో ద్వారా దొంగను గుర్తించే పనిలో ఉన్నట్లు చెప్పారు. కాగా ఈ కిరీటం వెండి, బంగారు లోహాలతో తయారు చేశారు.

# ఒకరు 53 రోజులు - మరొకరు 16 నెలలు.. నేతల జైలు రాజకీయం..!

హైదరాబాద్ పెన్ పవర్: రెండు అగ్రపార్టీల నాయకులు..తమ తమ జైలు జీవితాలను ప్రస్తావించడం రాజకీయంగా సరికొత్త వ్యూహానికి దారులు వేస్తున్నారనే సంకేతాలు ఇచ్చినట్టు అయింది. చంద్రబాబు ఢిల్లీ పర్యటన ముగించుకుని వచ్చిన తర్వాత.. అనూహ్యంగా తన జైలు జీవితంపై సుమారు 15 నిమిషాలపాటు మీడియాకు వివరించా రు. తాను 53 రోజుల పాటు జైల్లో ఉన్నానని.. దోమలు కుట్టాయని, సరైన వసతులు కూడా లేవని, వైద్యం కూడా అందించలేదని చెప్పారు. అంతేకాదు.. అసలు తనను లేపేసేందుకు కూడా కుట్రలు జరిగాయ న్నారు. అయితే.. ఇదివాస్తవమే అయనా.. ఇప్పుడే ఎందుకు చంద్రబాబు అంత సుదీర్ఘంగా జైలు జీవితాన్ని చెప్పు కొచ్చారన్నది ప్రశ్న. ప్రస్తుతం ఉన్న పరిస్థితిలో కూటమి సర్కారుపై ప్రజల్లో అసంతృప్తి నెలకొంది. ఇది వాస్తవం. అయితే.. దీనిని కొంతవరకైనా తప్పించేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. దీనిలో భాగం గానే అనేక విషయాలు చెప్పుకొస్తున్నారన్నది విశ్లేషకుల మాట. కొంత సింపతీ వస్తుందని.. దీంతో



ఆయన చాలా కష్టాలు పడి అధికారంలోకి వచ్చారన్న భావన రెయిజ్ అవుతుందని అనుకుంటున్నారు. ఇదిలావుంటే.. అనూహ్యంగా అదే రోజు వైసీపీ అధినేత జగన్ కూడా.. తన జైలు జీవితం గురించి చెప్పు కొచ్చారు. వాస్తవానికి జగన్ గత పదేళ్లలో ఎప్పుడూ వ్యక్తిగతంగా తన కష్టాలు చెప్పుకొన్న పరిస్థితి లేదు. మరీముఖ్యంగా తన జైలు జీవితం గురించి అయితే.. ఆయన ఎక్కడా చెప్పలేదు. కానీ, తాజాగా వైసీపీ నేతల్లో నెలకొన్న అసంతృప్తులు.. పార్టీ అధినేతపై ఉన్న కోపం నేపథ్యంలో వారిని సంతృప్తి పరిచేందుకు.. వారిని దారిలో పెట్టుకునేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారు. – టెన్నిస్ గ్రేట్ నాదల్.. మన అనంతపురంలో స్కూల్ ఫౌండర్ దీనిలో భాగంగానే తనపై సింపతీ ఏర్పడేలా ఆయన వ్యూహాత్మకంగా జైలు జీవితాన్ని ప్రస్తావించారనేది పరిశీలకుల మాట. నేను 16 నెలలు జైల్లో ఉన్నాను. దీనికి కారణాలు అందరికీ తెలిసినవేనని.. ఇప్పుడు కూడా తనపై కుట్రలు జరుగుతున్నాయని.. ఎప్పుడు ఏం జరుగుతుందనేది ఎవరూ చెప్పలేక పోతున్నారని కూడా ఆయన వ్యాఖ్యానించారు. తద్వారా.. పార్టీపై నాయకుల్లో సింపతీ ఏర్పడేలా జగన్ ప్రయత్నిస్తున్నారని.. తద్వారా.. పోయిన ఇమేజ్‌ను, నాయకుల నైరాశ్యాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని అంటున్నారు. ఏదేమైనా ఇద్దరు కీలకనాయకులు ఇలా తమ జైలు జీవితాల గురించి చర్చించుకోవడం.. సోషల్ మీడియాలో చర్చగా మారింది.

# డ్రగ్స్ కేసులో నటి పేరు.. డ్రగ్ డాన్ ఎవరో తెలీదు!

హైదరాబాద్ పెన్ పవర్: గ్యాంగ్‌స్టర్ ఓంప్రకాష్ ఎవరో తెలుసుకోవడానికి గూగుల్‌లో వెళ్లాల్సి వచ్చిందని మలయాళ నటి ప్రయాగ మార్టిన్ చెప్పింది. కొచ్చిలో డ్రగ్స్ కేసులో పోలీసులు ప్రశ్నించిన అనంతరం మీడియా ప్రతినిధులతో నటి ప్రయాగ మార్టిన్ స్పందించారు. గత వారం కొచ్చిలో అలాన్ వాకర్ మ్యూజిక్ షోకు సంబంధించి ఓంప్రకాష్ ఉపయోగించిన హోటల్ గదిని సందర్శించిన నటీనటుల్లో ప్రయాగ, శ్రీనాథ్ భాసి(మంజుమ్మల్ బోయ్స్ నటుడు)లను పోలీసులు గురువారం విచారించారు. హోటల్ గదిలో డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. దీంతో డ్రగ్ డీలర్ తో మాట్లాడిన ఆ ఇద్దరిపైనా పోలీసులు అనుమానిస్తున్నారు.

అయితే ప్రయాగ మార్టిన్ తాజా మీడియా విచారణలో ఆసక్తికర వ్యాఖ్యలు చేసారు. %––%ఈ జీవితంలో సాంఘికంగా జీవించడం ఒక భాగం.. మేము చాలా మందిని కలుస్తాము. వారు నేరస్తులా కాదా అనేది తెలుసుకోవడం సాధ్యం కాదు. మేము చేయగలిగేది సరిగ్గా ప్రవర్తించడమే%––% అని పోలీసులు ప్రశ్నించిన తర్వాత ప్రయాగ విలేకరులతో అన్నారు. ఒకరికి పోలీస్ క్లీన్ చిట్: గ్యాంగ్‌స్టర్ ఓం ప్రకాష్‌తో సంబంధం ఉన్న రేవ్ పార్టీ కేసులో నటి ప్రయాగ మార్టిన్, నటుడు శ్రీనాథ్ భాసీల వాంగ్మూలాల వివరాలు బయటకు వచ్చాయి. ఇద్దరికీ ఓం ప్రకాష్ ప్రత్యక్షంగా తెలియదని పోలీసులు తెలిపినట్టు కేరళ కౌముది వెబ్ సైట్ పేర్కొంది. ఘటన జరిగిన రోజు



తెల్లవారుజామున 4 గంటలకు ప్రయాగ లగ్జరీ హోటల్‌కు వచ్చింది. ఆమె ఉదయం 7 గంటలకు బయలుదేరింది. ఆ రోజు జరిగిన పార్టీలో ప్రయాగ మార్టిన్, శ్రీనాథ్ భాసీ డ్రగ్స్ వాడినట్లు ఆచూకీ లభించలేదు. రక్త పరీక్షకు సిద్ధంగా ఉన్నామని నటీనటులు నిన్న విచారణ అధికారులకు తెలియజేశారు. ఇద్దరి వాంగ్మూలాలను దర్యాప్తు బృందం కూలంకషంగా పరిశీలిస్తోంది. %ూశ్రీంశీ =ముం% – ఒకరు 53 రోజులు – మరొకరు 16 నెలలు.. నేతల జైలు రాజకీయం..! నటి ప్రయాగ మార్టిన్ నిన్న సాయంత్రం ఎర్నాకులం సౌత్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. ప్రయాగ తన స్నేహితులను కలిసేందుకు హోటల్‌కు వెళ్లినట్లు విచారణ అధికారులకు తెలిపింది. రేవ్ పార్టీ గురించి తెలియదు .. ఓం ప్రకాష్ ఎవరో తెలియదు అని తెలిపింది. ఆ వార్త వచ్చిన తర్వాత గూగుల్ ద్వారా ఓం ప్రకాష్ ఎవరో తెలుసుకున్నానని ప్రయాగ తెలిపింది. ప్రయాగ వాంగ్మూలం సంతృప్తికరంగా ఉన్నందున, ఆమెకు మళ్లీ సమన్లు ఇవ్వాల్సిన అవసరం లేదని దర్యాప్తు అధికారులు అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉంటే ఈ కేసులో ప్రమేయం ఉన్న బిను జోసెఫ్, శ్రీనాథ్ బసి ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు బృందానికి కొన్ని అనుమానాలు ఉన్నాయి. దీంతో శ్రీనాథ్ భాసిని మరోసారి విచారణకు పిలిచే అవకాశం ఉంది. వీరి మధ్య డ్రగ్స్ లావాదేవీలు ఏమైనా ఉన్నాయా అనే విషయం కూడా పరిశీలిస్తారు.